

అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివ మాదిగ

ప్రజా కవి అందెశ్రీకి ఘన నివాళి

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా కవి అందెశ్రీ లేని లోటు తీర్చలేనిదని, తెలంగాణ సమాజానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ అన్నారు. శనివారం పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌లో టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రజా కవి అందెశ్రీ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా విలువలు, సేవాభావం, నిస్వార్థ కార్యకలాపాలకు పెట్టింది పేరు అందెశ్రీ అని కొనియాడారు. తెలంగాణ సమాజాన్ని మేల్కొల్పేందుకు ఎన్నో గొప్ప, గొప్ప పాటలు రాసిన కవి అని అన్నారు. భారీ ఎత్తున చేరుకున్న టీఎమ్మార్పీఎస్ నేతలతో ర్యాలీ నిర్వహించారు.



విద్యార్థులతో కలిసి వందేమాతర గీతం ఆలపిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

● మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వందేమాతరం నినాదం 150 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో బంజారాహిల్స్, హిమాయత్‌నగర్‌లో శనివారం ఆయన విద్యార్థులతో పలు పాఠశాలల్లో వందేమాతరం గీతాలాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేమాతర గీతం స్వాతంత్రోద్యమ కారుల్లో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపిందని గుర్తు చేశారు.



జీహెచ్ఎంసీ, హోటల్ కార్మికులకు రగ్గులను అందజేస్తున్న శేషుకుమారి

హోటల్, పారిశుద్ధ్య కార్మికులకు రగ్గుల పంపిణీ

అమీర్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చలిని తట్టుకునేందుకు జీహెచ్ఎంసీ, హోటల్ కార్మికులకు సామాజిక కార్యకర్త కొత్తపల్లి మధుసూదన్‌రావు ఉన్ని రగ్గులను శనివారం పంపిణీ చేశారు. అమీర్‌పేట రిలయన్స్ గల్లీలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 200 మందికి రగ్గులను పంపిణీ చేశారు. భోజనం కూడా అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి మాట్లాడుతూ సమాజ సేవ చేయడంలో మధుసూదన్‌రావు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మన్మిత్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సర్దార్ టిల్లూబాయ్, కొత్తపల్లి విజయలక్ష్మి, సామాజిక సేవకులు షాబాద్ శ్రీనివాసరావు, సుధాకర్, ప్రకాష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కూతురు నర్సింహ, రాణికౌర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



రామలింగేశ్వర ఆలయంలో జరిగిన సమావేశంలో రమేష్, నీలిమ

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు బండి రమేష్, కోటనీలిమ అన్నారు. 'శ్రీ రామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణం - అభివృద్ధి'పై ఆలయ నిర్మాణ దాత విశాల్‌సుదాం ఆధ్వర్యంలో స్థానిక భక్తులతో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఆలయాన్ని సందర్శించిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ సూచన మేరకు ఆలయ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించాలన్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు సాంబశివుడు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రమేష్ స్థానికులు చంద్రమోహన్, రమేష్, రమాదేవి, నర్సింగ్‌రావు, వెంకట్‌రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు శ్రీకారం

అమీర్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల నియంత్రణకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు శ్రీకారం చుట్టారు. శనివారం ఎస్ఆర్‌నగర్‌లోని రెసోనెన్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి తాము బ్యాంక్ అధికారులం అని, పోలీస్ శాఖ నుంచి మాట్లాడుతున్నామని చేసే ఫోన్లను విశ్వసించవద్దని సూచించారు. ముఖ్యంగా యూపీఐ కోడ్ నెంబర్‌ను రహస్యంగా ఉంచాలన్నారు. అనుకోకుండా మీ బ్యాంక్ ఖాతాలు హ్యాక్ అయితే వెంటనే పూర్తి వివరాలతో 1930కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ముందుగా సైబర్ క్రైం.గౌట్.ఇన్ నేషనల్ సైబర్ క్రైమ్ రెస్పాండెంట్ పోర్టల్‌లో వివరాలను పొందుపరుస్తే సైబర్ నేరగాళ్ల అకౌంట్లను సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజురాథోడ్, విద్యార్థులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిఠాయి దుకాణం సాస్‌లో బొద్దింక



సాస్‌లో బొద్దింక

ఖైరతాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ చౌరస్తా సమీపంలోని తివారి బ్రదర్స్ మిఠాయి దుకాణంలోని సాస్‌లో బొద్దింక రావడం కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లికి చెందిన మహేందర్ భార్యతో కలిసి శనివారం ఖైరతాబాద్‌లోని తివారి బ్రదర్స్ మిఠాయి దుకాణానికి వచ్చాడు. రెండు రకాల స్వీట్స్‌తో పాటు కచోరీ ఇవ్వమని కోరగా సిబ్బంది ఇచ్చారు. అందులోనే ఉన్న హోటల్‌లో వాటిని తింటుండగా కచోరీ తోపాటు వచ్చిన సాస్‌లో బొద్దింక కనిపించింది. ఈ విషయమై అందులోని సిబ్బందికి, తద్వారా యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా, వారు స్పందించ లేదు. దీంతో మహేందర్ జీహెచ్ఎంసీ వైద్యాధికారికి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

మైత్రీవనం వద్ద ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

● ఎమ్మెల్యే నవీన్ యాదవ్



మైత్రీవనం వద్ద స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్, పలు కాలనీలవాసులు

బంజారాహిల్స్/అమీర్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్‌యాదవ్ అన్నారు. విగ్రహం ఏర్పాటు చేసేందుకు మైత్రివనం వద్ద కేటాయించనున్న స్థలాన్ని శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలు కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ప్రాంతీయ అభివృద్ధి, కళాసాంస్కృతిక విలువలకు నాంది పలికేలా విగ్రహాన్ని తీర్చిదిద్దాలని కాలనీ వాసులు కోరారు. అనంతరం నవీన్‌యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అధికారికంగా స్థలం గుర్తింపు పూర్తయిన వెంటనే విగ్రహావిష్కరణ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీకేగూడలో అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

అమీర్‌పేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలోని సిరి సంపద అపార్ట్‌మెంట్ కింద ఉన్న షెట్టర్ల ఎదుట ప్రభుత్వ భూమిలో నిర్మించిన కట్టడాలను ఎట్టకేలకు టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల రక్షణలో శనివారం ఉదయం కూల్చివేశారు. గత నెలలో సిరి సంపద అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నిర్వాహకులు నాయుడు, రాము మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి ఆక్రమణకు సంబంధించిన వివరాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తలసాని ఆదేశాల మేరకు అమీర్‌పేట రెవెన్యూ అధికారులు సిరి సంపద అపార్ట్‌మెంట్‌ను సందర్శించి గదులను అద్దెకు తీసుకున్న గౌరీ శంకర్‌తో మాట్లాడారు. కాగా, తన వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని భూ ఆక్రమణకు పాల్పడలేదని చెప్పారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి నెల రోజులు దాటిపోతున్నా ఎలాంటి డాక్యుమెంట్లు చూపించకపోవడంతో రంగంలోకి దిగిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సురేష్ కుమార్, సంతోష్ తమ సిబ్బందితో కలిసి రోడ్డు పై నిర్మించిన ప్రహరీ, మరుగుదొడ్డిని కూల్చివేశారు. షెట్టర్ ముందు ఏర్పాటు చేసిన రేకులషెడ్డును తొలగించేందుకు ప్రయత్నించగా తనకు ఒక రోజు సమయం కావాలని కోరడంతో సోమవారం వరకు అవకాశం ఇచ్చారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



సురేష్‌ను అభినందిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలు కాకుండా కేంద్రంలోని బీజేపీ మోకాలడ్డుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం తన నివాసానికి మర్యాద పూర్వకంగా కలిసేందుకు వచ్చిన బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్‌తో బీసీ రిజర్వేషన్‌ల పెంపు అంశంపై చర్చించారు. బీసీ రిజర్వేషన్‌ల పెంపు కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా, కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజుగౌడ్

42 శాతం రిజర్వేషన్ సాధించుకోవాలి

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం బడుగు, బలహీనవర్గాలు సంఘటితమై ఐక్యతతో సాధించుకోవాలని రాష్ట్ర బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీహాల్లో రాష్ట్ర బీసీ పొలిటికల్ ఫ్రంట్ గ్రేటర్ అధ్యక్షుడు జి.దామోదర్‌గౌడ్ అధ్యక్షతన బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్పొరేటర్ వనం సంగీత, వనం శ్రీనివాస్ యాదవ్, కుమార్ చౌదరి యాదవ్, మోహన్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, దేవరాజ్, వెంకన్నగౌడ్, దుర్గయ్యగౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసుల విధులకు ఆటంకం

● నలుగురు న్యాయవాదులపై కేసు

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో శ్వాస పరీక్షకు సహకరించకపోగా పోలీసులను బెదిరించి విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించిన నలుగురు న్యాయవాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.రఘురాంరెడ్డి ఈనెల 21న జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10లో సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. అదే దారిలో వెళ్తున్న స్కార్పియో వాహనాన్ని కానిస్టేబుళ్లు సాయికుమార్, దానయ్య, కిషోర్‌రాజు ఆపి డ్రైవింగ్ సీటులో ఉన్న విద్యాసాగర్‌కు శ్వాస పరీక్ష చేసేందుకు సిద్ధమయ్యారు. విద్యాసాగర్‌తో పాటు కారులో ఉన్న హేమంత్, వరుణ్, కౌశిక్‌రెడ్డి వారించారు. తాము ఎవరమో తెలుసా? అంటూ ప్రశ్నించారు. తలుచుకుంటే ఎవరి పోస్టు ఉండదంటూ పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. పోలీసులను పక్కకు తోసి పారిపోయేందుకు ప్రయత్నించగా ట్రాఫిక్ పోలీసులు శాంతిభద్రతల విభాగానికి సమాచారం ఇచ్చారు. జూబ్లీహిల్స్ పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా వారంతా న్యాయవాదులని తేలింది. కారును సీజ్ చేసి నలుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

విద్యుత్‌సంస్థల్లో బీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌సంస్థల్లో బీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం 2014 నుంచి ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని విద్యుత్ బీసీ భవన్‌లో తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఆర్టిజన్లకు అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. విద్యుత్‌సంస్థల్లో డైరెక్టర్ పోస్టుల్లోనూ బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో 1999 నుంచి 2004 వరకు పాత పెన్షన్ విధానాన్ని కల్పించాలన్నారు. బీసీ భవన్ స్థలం ఆక్రమిస్తున్నారని, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని అన్నారు. విద్యుత్ బీసీ భవనానికి ఎదురుగా ఉన్న మహనీయుల విగ్రహాలు తొలగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి కోడెపాక కుమార స్వామి, ముత్యం వెంకన్నగౌడ్ మాట్లాడుతూ విద్యుత్‌సంస్థలకు ఐఏఎస్‌లు వచ్చిన తర్వాత కూడ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు పి.యాదగిరి, కార్యదర్శి మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, నరేష్, వెంకటేష్, సిద్దిలింగం, రవీందర్, గోవర్ధన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

స్పెషాలిటీ వైద్యులకు క్యాన్సర్‌పై అవగాహన అవసరం



బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో బోన్ 2025-ఆర్థో అంకాలజీపై జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్య నిపుణులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒక స్పెషాలిటీలో నైపుణ్యం సాధించిన వైద్యులు క్యాన్సర్ లాంటి మహమ్మారికి సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కలిగిన వారైతే ఎక్కువ మందిని కాపాడగలుగుతారని టాటా మెమోరియల్ సెంటర్ ప్రొఫెసర్, ఆర్థో అంకాలజిస్టు ఆశిష్ గులియా అన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం 'బోన్ 2025' పేరుతో ఎముక, మృదు కణజాల కణితుల నిర్వహణలో క్లినికల్ నైపుణ్యత, జ్ఞానాన్ని పెంపొందించడానికి ఆర్థో అంకాలజీపై ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వచ్చిన వారికి శస్త్ర చికిత్స చేసినా చనిపోయే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, ఏం చేస్తారని చాలామంది అడిగారని చెప్పారు. అయినా, తాను ముందుకు వెళ్లిన తర్వాత గతంలోలా ఎముకల క్యాన్సర్ కారణంగా చనిపోయే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని అన్నారు. బసవతారకం ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్ రావు మాట్లాడుతూ సరికొత్త మెళకువలను ఎప్పటికప్పుడు తెలుసుకోగలిగితే ఒక రోగికి మంచి వైద్యం అందించగలుగుతామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కె.కృష్ణయ్య, డాక్టర్లు రుద్రప్రతాప్ సింగ్, తడల ఎస్.ఎస్ హర్ష, రాజీవ్‌రెడ్డి, హిమాకాంత్, అశ్విన్ ప్రజాపతి, శ్రీనాథ్‌గుప్తా, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి పట్ల అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వెళ్లిన యువతి పట్ల గుర్తు తెలియని యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్ నగర్‌కు చెందిన యువతి ఉదయం సాయిబాబా మందిర్‌కు వెళ్లింది. పూజల అనంతరం సోదరుడి కోసం గుడి ఎదుట రోడ్డుపై నిలబడింది. కృష్ణకాంత్ పార్కు వైపు నుంచి నడిచి వస్తున్న ఓ గుర్తు తెలియని యువకుడు సదరు యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో కేకలు వేసింది. యువతి సోదరుడు కేకలు విని వచ్చేలోపు యువకుడు పారిపోయాడు. జరిగిన విషయం సోదరుడికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



జైల్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

సివరేజీ పైపులైన్‌ల తర్వాతే సీసీ రోడ్లు

● కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సివరేజీ పైపులైన్‌లు పూర్తయ్యాక సీసీ రోడ్లు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. ఫిలింనగర్‌లోని జైల్‌సింగ్‌నగర్‌లో ఆయన జలమండలి అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. బస్తీలో పాడైన సివరేజీ పైప్‌లైన్ స్థానంలో కొత్తది వేసేలా ప్రతిపాదనలు చేయాలని సూచించారు. మిగతా ప్రాంతాల్లో కూడా కొత్త పైపులైన్‌లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాంబాబు, సివరేజీ డిపార్ట్‌మెంట్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ హరిబాబు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌లో తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న సి.ఎన్.రెడ్డి

అభివృద్ధి పనుల పరిశీలన

బోరబండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో అభివృద్ధి పనులను కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి శనివారం పరిశీలించారు. శ్రీరామ్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లో రోడ్లు, సివరేజీ పైపులైన్, కాల్వ విస్తరణ పనులను కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. పనుల నాణ్యతపై సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. తక్షణమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



వయో సేవారత్న అవార్డును అందజేస్తున్న దేవేందర్‌రెడ్డి, జేఎస్‌టీ సాయి తదితరులు

వయో సేవారత్న అవార్డుల ప్రదానం

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయో సేవారత్న అవార్డుల కార్యక్రమం శనివారం జరిగింది. పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన 12 మంది వయోవృద్ధులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు పైబడినా సమాజ సేవయే పరమావధిగా వయో వృద్ధులు పనిచేయడం హర్షణీయమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ సాయి మాట్లాడుతూ వయోవృద్ధులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రైళ్లలో రాయితీ ఇవ్వడంతో పాటు డేకేర్ సెంటర్లను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కె.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడిలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్లను బీజేపీ నాయకులు విజయకుమార్, అశోక్‌యాదవ్, ఆనంద్ ప్రారంభించారు. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ ప్రాంతంలో పర్యటనకు వచ్చినప్పుడు లైట్ల ఆవశ్యకతను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో జీహెచ్ఎంసీ అధికారులను లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు రెండు రోజుల క్రితం భారీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడంతో బీజేపీ నాయకులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, బాబు పాల్గొన్నారు.

ఇంట్లో గొడవపడి యువకుడు అదృశ్యం



శశాంక్

ఖైరతాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో గొడవపడి ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ గాంధీనగర్‌కు చెందిన చెన్నబోయిన శశాంక్ (30) గత నెల 30న ఇంట్లో గొడవ పడి వెళ్లిపోయాడు. నాలుగు రోజుల నుంచి ఫోన్‌కు స్పందించకపోవడంతో తల్లి ప్రేమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పునరాలోచనలో పాలకమండలి

లీజు పొడిగింపుపై కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో చర్చ



బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో పాల్గొన్న ఈటల, శ్రీగణేశ్

సికింద్రాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ కార్యాలయం రాసిన లేఖ నేపథ్యంలో.. బొల్లారంలోని రెడ్‌క్రాస్‌కు ఇచ్చిన ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకునే విషయమై సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి పునరాలోచనలో పడింది. రెడ్‌క్రాస్‌కు ఇచ్చిన లీజును పొడిగించాలా, లేక వెంటనే స్వాధీనం చేసుకుని వృద్ధాశ్రమం, పాఠశాలగాని నిర్మించాలా అనే విషయమై శనివారం జరిగిన కంటోన్మెంట్ పాలక మండలి సమావేశంలో చర్చించారు. బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్, నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, సీఈఓ అర్వింద్‌కుమార్ ద్వివేది, జాయింట్ సీఈఓ ఆషిఖ్ హుస్సేన్‌లు సమావేశంలో పాల్గొన్నారు. బొల్లారంలోని జీఎల్ఆర్ సర్వే నెంబరు 30-828లోని ఖాళీ స్థలాన్ని 1948లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి లీజుకిచ్చారు. అనంతరం ఆ లీజును ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వస్తున్నారు. అయితే మరోసారి లీజు గడువును పొడిగించాల్సిన పరిస్థితి రావడంతో రూ.6 లక్షల 19వేల రుసుం చెల్లించాలని సొసైటీకి కంటోన్మెంట్ బోర్డు లేఖ రాసింది. కాగా రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్ర గవర్నర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నేపథ్యంలో గవర్నర్ కార్యాలయం నుంచి బోర్డుకు ఓ లేఖ వచ్చింది. సామాజిక సేవ లక్ష్యంగా పని చేసే రెడ్‌క్రాస్ సొసైటీకి రుసుం మొత్తం మాఫీ చేసి, ఆ ఖాళీ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాల్సిందిగా కోరింది. అయితే స్థలాన్ని స్వాధీనం చేసుకుని వృద్ధాశ్రమం, పాఠశాలల్లో ఏదేని ఒకటి నిర్మించి, నిర్వహించాలని యోచిస్తున్న కంటోన్మెంట్ బోర్డు గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన లేఖతో పునరాలోచనలో పడింది. శనివారం జరిగిన బోర్డు పాలక మండలి సమావేశంలో దీనిపై చర్చించారు. దీనిపై మరింత లోతుగా చర్చించి, తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

పేదలకు న్యాయం చేయాలి: ఈటల

కంటోన్మెంట్‌లో పేదలకు న్యాయం జరిగేలా చూడాలని మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ సూచించారు. ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు పేరిట పేదల కడుపులు కొట్టవద్దని కోరారు. ఇంటి నిర్మాణ నిబంధనలు సరళీకృతం చేయడం తదితర అంశాలపై దృష్టి సారించాలని, జూబ్లీబస్టేషన్ పక్కనే పేదలకు లైసెన్స్‌లు ఇచ్చి దుకాణాలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

రాబడి వనరులను పెంచుకోండి: శ్రీగణేశ్

బోర్డు పరిధిలో రాబడి వనరులను పెంచుకోవాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలను పెంచాలని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ అధికారులకు సూచించారు. పన్నుల ద్వారా చెల్లించిన డబ్బులతో చేపట్టే పనులను సాఫీగా జరిగేలా చూడాలని కోరారు. ఆక్రమణల కూల్చివేతకు సిద్ధమవుతున్న అధికారులు పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని చెప్పారు. ఏఓసీ రోడ్లకు ప్రత్యామ్నాయంగా నిర్మించాలని జీహెచ్ఎంసీ ప్రతిపాదించిన రోడ్లకు తక్షణమే ఆమోదం తెలపాలని సూచించారు.

సమావేశంలో చర్చించిన ఇతర అంశాలు

- ఏఓసీ జంక్షన్‌కు అనుసంధానంగా ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, రసూల్‌పురా జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని జీహెచ్ఎంసీ పంపిన ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. ఈ ప్రాంతాల్లో రక్షణ శాఖ స్థలాలు ఏమైనా ఉన్నాయోమో తెలుసుకునేందుకు డిఫెన్స్ ఎస్టేట్ అధికారిని కోరినందున ఆయన నుంచి నివేదిక తెప్పించుకుని, ఒకటి, రెండు రోజుల్లో సర్క్యులర్ అజెండా ద్వారా ఆమోదం తెలపాలని సమావేశంలో నిర్ణయించారు.
- ఆయా వార్డుల్లో నిర్మించాలని రూపొందించిన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల ప్రతిపాదనలను పాలక మండలి ఆమోదించింది
- ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం నేపథ్యంలో అంతర్గత రోడ్లకు మరమ్మతులు జరపడంపై చర్చించారు.



కాలనీవాసుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం: శ్రీగణేశ్

తిరుమలగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాలనీల పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ శనివారం బొల్లారం వార్డు-శిలోని చింతల్ బజార్ వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ, స్నేహ కాలనీల్లో కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఎన్నోఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ, అంతర్గత రహదారులు, పార్కులను అభివృద్ధి చేయాల్సి ఉందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ కాలనీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్నేహ కాలనీ పార్కును మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తానని, పార్కులో వాకింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్ట్, యోగా సెంటర్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. సీఎం నియోజకవర్గానికి అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ నిధులతో అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ కదిరవన్, బాలరాజు, రామ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు నిత్య అల్పాహారం

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడుబండ్ దేవాలయ ప్రాంగణంలో అయప్ప స్వామి మాల ధరించిన భక్తులకు శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 41 రోజుల పాటు అల్పాహారం అందిస్తున్నట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల సేవ ఎంతో పవిత్రమైందని వారికి సేవ చేయడం ద్వారా ఎంతో ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి షష్ఠికి ఏర్పాట్లు

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో 26న సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి జి. సుధాకర్, పాలకమండలి చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఆవుపాలతో అభిషేకం, చందన పుష్ప అలంకరణ అర్చన, ప్రసాద వితరణ వంటి పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం ఆరున్నర గంటలకు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



అన్నప్రసాదంలో పాల్గొన్న భక్తులు

హనుమాన్ ఆలయంలో అన్నప్రసాద వితరణ

అడ్డగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పహాడి హనుమాన్ ఆలయంలో ప్రతి చివరి శనివారం అన్నప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ ప్రసాద్ తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నామని, ఇక నుంచి నిరంతరంగా నెల చివరి శనివారం మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అన్నదాత దశరథ్, విష్ణు ప్రకాశ్, లలిత్ . సంతోష్, విఠల్, విజయలక్ష్మిలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతదేహం

అడ్డగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాణిగంజ్ మినిస్టర్ రోడ్డులోని ఓ వృద్ధుడి ఇంటి సమీపంలో గుర్తు తెలియని 35ఏళ్ల వ్యక్తి హల్ చేస్తుండగా కొడుకును పిలిపించి సదరు వ్యక్తిని బయటికి పంపించేందుకు ప్రయత్నం చేశాడు. వెంటనే ఆ వ్యక్తి పక్కనే ఉన్న గోడౌన్‌లోకి పరుగెత్తుకుని వెళ్లాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గోడౌన్‌లో ఉన్న వ్యక్తిని బయటికి రావాలని కోరారు. సదరు వ్యక్తి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు, పోలీసులు గోడౌన్‌లోకి వెళ్లి చూడగా ఫర్నిచర్స్ మధ్య వద్ద ఊపిరి ఆడక చనిపోయి ఉన్నాడు. వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి వైద్య పరీక్షలు నిర్వహించగా అప్పటికే అతడు చనిపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో వ్యక్తి మృతి



రవి కులకర్ణి

అడ్డగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన రవి కులకర్ణి(31) 20న సికింద్రాబాద్‌లోని 10వ నంబరు ఆర్టీసీ బస్టాపు వద్ద చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి అతడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డు అడ్రస్ ప్రకారం మహారాష్ట్ర తానా పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహారాష్ట్ర పోలీసులు ఈ అడ్రస్‌లో ఎవరూ లేరని చెప్పడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



కొండయ్య

బౌద్ధనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం పార్సీగుట్ట సంజీవపురం నివాసి సంద్ర కొండయ్య(45) నగరంలోని వివిధ శుభాకార్యాలకు వెళ్లి వంటలు చేస్తుంటాడు. 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన కొండయ్య తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతని కోసం కుటుంబసభ్యులు, బంధువులు పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటం లేదని భార్య శారద శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వయో సేవారత్న అవార్డుల ప్రదానం

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వయో సేవారత్న అవార్డుల కార్యక్రమం శనివారం జరిగింది. పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన 12 మంది వయోవృద్ధులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు పైబడినా సమాజసేవయే పరమావధిగా వయో వృద్ధులు పనిచేయడం హర్షణీయమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ సాయి మాట్లాడుతూ వయోవృద్ధులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రైళ్లలో రాయితీ ఇవ్వడంతో పాటు డేకేర్ సెంటర్లను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, యూనియన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కె.శేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం : డీఐ



ప్రజలకు అవగాహన కలుగజేస్తున్న డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మౌనిక, బస్తీవాసులు

పద్మారావునగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు అనేక మార్గాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని, సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గాంధీనగర్ పీఎస్ డీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాద్ నగర కమిషనర్ సూచనల మేరకు నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాగృత్ హైదరాబాద్, సురక్షిత్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ పీఎస్ ఆధ్వర్యంలో బోయగూడలోని పలు ప్రాంతాల్లో ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల భద్రతకు పోలీసు వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తోందని అన్నారు. సైబర్ నేరాలు జరిగే తీరును ప్రతిఒక్కరూ తెలుసుకొని, ఇతరులకు తెలపాలని అన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు తమ సహకారం అందించాలని అన్నారు. అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్‌లను నమ్మవద్దని, ఓటీపీ,పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ తెలపవద్దని అన్నారు. ఏదైనా మోసానికి గురైన పక్షంలో 1930 నేషనల్ హెల్ప్‌లైన్‌కి కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, పోలీసు సిబ్బంది,స్థానిక నాయకులు వెంకటేశన్‌రాజు,అంగముత్తు శ్రీనివాస్,శివకుమార్,మహేశ్,హరికృష్ణ,వెంకట్‌లు పాల్గొన్నారు.

నేడు వారాసిగూడలో యూనిటీ మార్చ్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నెహ్రూ యువకేంద్ర అధికారిణి ఖుష్బూగుప్తా

బౌద్ధనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంత్సోవాలు పురస్కరించుకుని ఆదివారం తలపెట్టిన యూనిటీ మార్చ్(ఐక్యత పరుగు)ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ తెలిపారు. శనివారం వారాసిగూడలో ఏర్పాటుచేసిన సమావేశంలో నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారిణి ఖుష్బూగుప్తాతో కలిసి మాట్లాడారు. వారాసిగూడ ఛత్రపతి శివాజీ విగ్రహం నుంచి ఆదివారం ఉదయం 9:30కి ర్యాలీ ప్రారంభమై చిలకలగూడ గాంధీబొమ్మ వరకు సుమారు వెయ్యిమందితో ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ యూనిటీ మార్చ్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. పటేల్ ఉక్కు మనిషిగా భారతదేశాన్ని గొప్పగా తీర్చిదిద్దిన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని జిల్లా అధికారిణి ఖుష్బూగుప్తా తెలిపారు. ఈ సమావేశంలో మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాజశేఖర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, శ్యాంసుందర్, ప్రభుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

రూ.2.36 కోట్ల విలువైన వస్తువులు అప్పగించాం

రైల్వే సెక్యూరిటీ కమిషనర్ నవీన్ కుమార్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలో ప్రయాణం చేస్తూ వస్తువులు పోగొట్టుకున్న ప్రయాణీకులకు రూ.2.36 కోట్ల విలువ చేసే విలువైన వస్తువులు అందజేశామని దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ అలకుంట నవీన్ కుమార్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్‌లో రైళ్లలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు తమ బంగారు ఆభరణాలు, వస్తువులు 'ఆపరేషన్ అమానత్' కింద ఆర్పీఎఫ్ పోలీసుల చురుకుగా పనిచేయడంతోనే వస్తువులు అప్పగించామన్నారు. 2025లో ఇప్పటివరకు 976 సందర్భాల్లో ప్రయాణీకుల వస్తువులను స్వాధీనం చేసుకుందన్నారు. ఆపరేషన్ అమానత్ కింద ప్రయాణీకుల ల్యాప్‌టాప్‌లు, పర్సులు, సెల్ ఫోన్లు, ఇతరత్రా బ్యాగులు, వస్తువులను అప్పగించడమైందన్నారు ఆపద వస్తే వెంటనే 139 నెంబరుకు సమాచారం ఇవ్వాలని, మీ సమస్యల్ని ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయండి

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి



సాంకేతిక కారణాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి తదితరులు

తార్నాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తార్నాకలోని సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ మరమ్మతు పనులను వెంటనే చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ పని చేయకపోవడం వలన నిత్యం విద్యార్థులు, వృద్ధులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకువెళ్ళారు. దాంతో శనివారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగపు అధికారులతో కలిసి ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌ను పరిశీలించారు. లిఫ్ట్ ఎందుకు పని చేయడం లేదు దానికి గల సాంకేతిక కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మూడు రోజుల్లో లిఫ్టు మరమ్మతు పనులు పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ములాయం సింగ్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.సింహాద్రి తదితరులు

ఘనంగా ములాయంసింగ్ యాదవ్ జయంతి

తార్నాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ 86వ జయంతిని శనివారం తార్నాకలోని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి, నాయకులు, కార్యకర్తలతో కలిసి ములాయం సింగ్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రొ. సింహాద్రి మాట్లాడుతూ సామాజిక న్యాయ యోధుడిగా, మత సామరస్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడిన మహా నాయకుడిగా భారత చరిత్రలో నిలుస్తారని కొనియాడారు.



రామలింగేశ్వర ఆలయంలో జరిగిన సమావేశంలో బండి రమేష్, కోట నీలిమ

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ప్రకాశ్‌నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు బండి రమేష్, కోటనీలిమ అన్నారు. 'శ్రీ రామలింగేశ్వర ఆలయ పునర్నిర్మాణం - అభివృద్ధిపై ఆలయ నిర్మాణ దాత విశాల్ సుదాం ఆధ్వర్యంలో స్థానిక భక్తులతో శనివారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఆలయాన్ని సందర్శించిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ సూచన మేరకు ఆలయ అభివృద్ధికి ప్రణాళికను రూపొందించాలన్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు సాంబశివుడు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రమేష్ స్థానికులు చంద్రమోహన్, రమేష్, రమాదేవి, నర్సింగ్‌రావు, వెంకట్‌రావు పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



బాలస్వామి, ఈస్ట్‌జోన్ డీసీపీ

బౌద్ధనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసులు బాధ్యతయుతంగా విధులను సక్రమంగా నిర్వహించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. పద్మారావునగర్ ఎస్వీ కాలేజీలో నాల్గోవరోజు శనివారం జరుగుతున్న 'ఒక గొప్పమార్పుకు ఇదే శ్రీకారం' సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

క్రీడల్లో ప్రోత్సాహం అందించాలి : తలసాని

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని శాంతి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ క్రికెట్‌లో ఫస్ట్ ప్రైజ్ గెలుపొందారు. శనివారం విద్యార్థులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి గెలుచుకున్న కప్‌ను ప్రదర్శించారు. ఎమ్మెల్యే విద్యార్థులను అభినందించారు.



కబడ్డీ, కోకో జోనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

కబడ్డీ, ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

బోయినపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్కూల్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ లెవెల్ చాంపియన్‌షిప్ కబడ్డీ, కోకో పోటీలు శనివారం బోయినపల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న, అతిథులుగా ఎస్‌వీఎస్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.సురేందర్, బి.హరికృష్ణ, ఆర్గనైజ్ సెక్రటరీ బి. లక్ష్మణ్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. జోనల్ స్థాయి నుంచి 10 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జేపీ యువసేన సభ్యులు కరణ్ సింగ్, వరప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత, నృత్య సమారోహ పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ సికింద్రాబాద్ పబ్లిక్‌స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్‌రావు జ్ఞాపకార్థం రెండు రోజుల పాటు నిర్వహించిన మధు నృత్య సమారోహ సంగీత నృత్య పోటీలు ముగిశాయి. ఈ పోటీలకు నగరంలోని 49 వివిధ పాఠశాలలకు చెందిన 450 మంది సంగీత, నృత్య కళాకారులు (విద్యార్థినిలు) పాల్గొని సంగీత, నాట్య ప్రదర్శనను గావించారు. ఇందులో రాణించిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ పి.జ్యోతి మధుసూదన్‌రావు ప్రశంసా పత్రాలను అందించారు. విజేతలుగా ప్రతిభ చాటిన కళాకారులకు ప్రశంస పత్రాలతో పాటు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ స్వాతి పంపాల్కర్ తదితరులు పాల్గొన్నారు.



రఘుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న బీసీ జేఏసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నియామకం

బౌద్ధనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ(బీసీ జేఏసీ) రాష్ట్ర కన్వీనర్‌గా వారాసిగూడకు చెందిన ప్రముఖ న్యాయవాది దేశబోయిన రఘు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ శనివారం రఘుకు అందజేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు సాధన కోసం పాటుపడతానని తెలిపారు. బీసీలంతా ఐక్యతగా ఉండి హక్కులను సాధించుకుంటామని తెలిపారు.